

పరిషత్ పోరులో విశ్రాంత డీడీపీఐ

బెంగళూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): విధానపరిషత్ ఎన్నికల్లో విద్యాశాఖ విశ్రాంత అధికారి బరిలోకి దిగారు. ఉడుపి జిల్లా డీడీపీఐ అధికారిగా రిటైర్డు అయిన భాస్కర్‌శెట్టి నైరుతి ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నా రు. విద్య, పాలనా వ్యవహారాల్లో మూడు దశాబ్దాల అనుభవం ఉందని ఉపాధ్యాయుల సమస్యలు తెలుసని అవకాశం ఇవ్వాలని ఆయన కోరారు. ఇదే నియోజకవర్గానికి డాక్టర్ అరుణ్ హొసకొప్ప పోటీ చేస్తున్నారు. శివమొగ్గ జిల్లా హొసకొప్పకు చెందినవారు. ప్రభుత్వ, ఎయిడెడ్ విద్యాసంస్థల్లో పనిచేశారు. అవకాశం ఇస్తే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తామని అంటున్నారు.

సిద్దూ సర్కార్‌కు ఏడాది

● ఐదు గ్యారెంటీల అమలు ● అసమ్మతి నేతలకు పదవులు

● పనితీరుకు అద్దం పట్టనున్న లోక్‌సభ ఫలితాలు



బెంగళూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): దక్షిణాదిలో మనుగడ కోల్పోయిన వేళ మరోసారి కర్ణాటకలో ప్రభుత్వం ఏర్పాటు ద్వారా కాంగ్రెస్ పార్టీ తన బలాన్ని నిరూపించుకుంది. 2013 నుంచి 2018 దాకా సిద్దరామయ్య నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగినా ఆ తర్వాతి ఎన్నికల్లో కుప్పకూలింది. బీజేపీ అధికారంలోకి రావాలని భావించినా జేడీఎస్‌తో కలసి కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేసుకుంది. ఈ వేదికను జాతీయస్థాయిలో ప్రాంతీయపార్టీలతో కలిపి కాంగ్రెస్ ఐక్య కూటమిగా మలచుకుంది. అయితే ఏడాదిన్నరకే సంకీర్ణ ప్రభుత్వం పతనమైంది. కాగా 2023 శాసనసభ ఎన్నికల్లో ఐదు గ్యారెంటీల హామీలతో బరిలోకి దిగారు. మూడున్నరేళ్ల బీజేపీ పాలనపై వ్యతిరేకత, ఐదు గ్యారెంటీలపై సామాన్యుల ఆశలు కలిపి అనూహ్యంగా 135 మంది ఎమ్మెల్యేలు గెలుపొందారు. ఇలా రాష్ట్రంలో సిద్దరామయ్య నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై నేటికి ఏడాది అవుతోంది. 2023 మే 20న సిద్దరామయ్య తన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఉపముఖ్యమంత్రిగా కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ ప్రమాణస్వీకారం చేశారు.

నేటి నుంచి ఏడాది సంబరాలు

సిద్దరామయ్య ప్రభుత్వానికి సోమవారంతో ఏడాది పూర్తికానున్న తరుణంలో సంబరాలు చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. సిద్దరామయ్య తన భవిష్యత్తు కార్యాచరణను సోమవారం ప్రకటించేందుకు మీట్ ది ప్రెస్‌కు ఆహ్వానించారు. మరోవైపు ముఖ్యమంత్రి మార్పు, దళిత ముఖ్యమంత్రి ప్రస్తావన వంటి అశాలు తరచూ వినిపిస్తున్నాయి. లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత రాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులు ఉంటాయనే చర్చలు జోరందుకున్నాయి. మరోవైపు నాలుగైదురోజుల క్రితం దళిత సీనియర్ మంత్రులు ప్రత్యేక సమావేశం నిర్వహించడం చర్చనీయాంశమవుతోంది. సిద్దరామయ్య ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా కొత్తగా ఎలాంటి పథకాలు ప్రకటిస్తారనే ఆసక్తి నెలకొంది.

హామీలకు అనుగుణంగా ఐదు గ్యారెంటీలు

శాసనసభ ఎన్నికల్లో ఐదు గ్యారెంటీల హామీలు ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పడగానే గ్యారెంటీల అమలు కోసం కసరత్తు చేశారు. ప్రభుత్వం ఏర్పడిన నెలరోజులకే సరిగ్గా జూన్‌లో శక్తి గ్యారెంటీ అమలు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మహిళలు ఉచితంగా ప్రయాణించే వెసులుబాటు కల్పించారు. ఆ తర్వాత అన్నభాగ్య పథకంలో భాగంగా కేంద్రం ఇస్తున్న ఐదు కిలోల బియ్యానికి అదనంగా మరో ఐదు కిలోలు ఇవ్వాలని ప్రయత్నించారు. కేంద్రప్రభుత్వ సంస్థల వద్ద నిల్వలు ఉన్నా రాష్ట్రానికి అదనపు కోటా ఇవ్వకపోవడంతో ఐదు కిలోల బియ్యానికి బదులుగా ప్రత్యామ్నాయంగా నగదు బదిలీ కొనసాగిస్తున్నారు. మరోవైపు గృహజ్యోతి ద్వారా గరిష్ఠంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నారు. ప్రతి గృహిణికి నెలసరి రూ. 2వేలు అందించే గృహలక్ష్మి గ్యారెంటీని కొనసాగిస్తున్నారు. ఈ పథకంలో ఇంకా సంపూర్ణంగా అందనివారు ఉన్నారనే విమర్శలు ఉన్నాయి. యువనిధి పథకం కింద డిగ్రీ, డిప్లొమో నిరుద్యోగులకు ప్రోత్సాహక ధనం అందించే పథకానికి డిసెంబరులో శ్రీకారం చుట్టారు. ఈలోగానే ఎన్నికల కోడ్ రావడంతో ఇది సంపూర్ణంగా అమలులోకి రాలేదు. మొత్తంపై రాష్ట్రంలో ఐదు గ్యారెంటీలు అమలులోకి తెచ్చారు. ఏడాదిలో ప్రభుత్వం జరిపిన ప్రతి కార్యక్రమంలోనూ గ్యారెంటీల విషయమై సీఎంతోపాటు మంత్రులు ప్రధానంగా ప్రస్తావిస్తూ వచ్చారు.


అసమ్మతి రగలకుండా రాజకీయ పదవులు

కాంగ్రెస్ పార్టీలో విచ్చలవిడి స్వేచ్ఛ ఉండడం సహజమే. సిద్దరామయ్య నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడ్డాక పలువురు సీనియర్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. బీఆర్ పాటిల్, బసవరాజరాయరెడ్డి, ఆర్‌వీ దేశ్‌పాండే వంటి సీనియర్లు భిన్నమైన అంశాలపై తమ ఆక్రోశాన్ని వ్యక్తం చేశారు. సీనియర్ ఎమ్మెల్యే బీఆర్ పాటిల్ బహిరంగంగానే మంత్రులపై విమర్శలు గుప్పించారు. బసవరాజరాయరెడ్డితో కలిపి పలువురు ఎమ్మెల్యేలు ప్రభుత్వ తీరుకు నిరసనగా ప్రత్యేక లేఖ రాశారు. ప్రారంభంలోనే ఈ అంశాలు తలెత్తడంతో ముఖ్యమంత్రి ఆచితూచి వ్యవహరించారు. బసవరాజ రాయరెడ్డికి రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక సలహాదారుడిగాను, బీఆర్ పాటిల్‌కు మరో పదవిని, ఆర్‌వీ దేశ్‌పాండేకు టీటీడీ బోర్డు సభ్యుడిగా అవకాశం కల్పించారు. ఐదేళ్ల తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని తమకు మంత్రిగా అవకాశాలు కల్పించాలని పలువురు పట్టుబట్టారు. కేబినెట్‌ను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసుకోవడంతో సీనియర్ ఎమ్మెల్యేలకు కాస్త ఇబ్బందికర పరిస్థితి నెలకొంది. పార్టీలో అసంతృప్తి పెరిగితే లోక్‌సభ ఎన్నికలపై ప్రభావం చూపుతుందని ఏకంగా 35మందికి పైగా ఎమ్మెల్యేలకు కీలకమైన బోర్డులు, కార్పొరేషన్ పదవులను కల్పించారు. ఇలా మంత్రులు 33 మంది మరో 35మందికి పైగా బోర్డుల్లో అధ్యక్ష పదవులు దక్కడంతో దాదాపు 70మంది ఎమ్మెల్యేలకు రాజకీయహోదాలు సుస్థిరమయ్యాయి. ఈ పరిణామం అసంతృప్తిని అణచివేసేందుకు కారణమైంది. మరో 35మందికిపైగా సీనియర్ నేతలు, కార్యకర్తలకు బోర్డులు, కార్పొరేషన్లలో చోటు లభించింది.

పరిషత్‌లో బలం పెంచుకునేందుకు..

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక వరుసగా ఎన్నికలు వస్తున్నాయి. ఇటీవల టీచర్ ఎమ్మెల్సీగా కాంగ్రెస్ నుంచి పుట్టణ్ణ గెలుపొందారు. ప్రస్తుతం ఆరు స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. మరో 12 స్థానాలకు ఎమ్మెల్యే కోటా కింద ఎన్నిక జరగాల్సి ఉంది. వీటిలో కాంగ్రెస్‌కు మెజారిటీ పరంగా కనీసం 8మంది గెలిపించుకునే అవకాశం ఉంది. ఇలా పరిషత్‌లో పలుకుబడి పెంచుకునే ప్రయత్నంలో ఉన్నారు.

పనితీరుకు అద్దం పట్టనున్న లోక్‌సభ ఫలితాలు



రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసుకున్న సిద్దరామయ్య ఆర్థికమంత్రి హోదాలో మరోసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం ద్వారా రాష్ట్రంలో సరికొత్త రికార్డును నమోదు చేశారు. బడ్జెట్‌లో గ్యారెంటీలకు రూ. 50వేల కోట్లు కేటాయించాల్సి రావడంతో అభివృద్ధికి కోత పడిందనే అభిప్రాయాలు ఉన్నాయి. ఏడాది పూర్తి కాకముందే ముఖ్యమంత్రితోపాటు ప్రభుత్వానికి లోక్‌సభ ఎన్నికలు ముంచుకొచ్చాయి. రాష్ట్రంలో 28 నియోజకవర్గాల్లో రెండు విడతలుగా పోలింగ్ జరిగింది. ఎక్కువ స్థానాలు గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగిన కాంగ్రెస్‌ను ఏకంగా 10మంది దాకా వారసులు, కుటుంబ సభ్యులకు టిక్కెట్లు ఇప్పించారనే చెడ్డపేరు వెంటాడింది. సీఎం సిద్దరామయ్య ఎన్నికల ప్రచారంలో భాగంగా దాదాపు వందసభలలో పాల్గొనగా గ్యారెంటీలు అమలు చేశామని, కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం అబద్ధాలు చెబుతోందనే అంశాలనే ప్రధానంగా ప్రస్తావించారు. మరో రెండువారాలలో ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. ప్రభుత్వ ఏడాది పనితీరుకు ఫలితాలు నిదర్శనం కానున్నాయి.

సీఎం, డీసీఎం చుట్టూ ప్రదక్షిణలు

● ఎమ్మెల్సీ పదవి కోసం నేతల పైరవీలు ● 8 స్థానాల కోసం పాతిక మంది పోటీ ● త్వరలో ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీల భర్తీ

బెంగళూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): విధానపరిషత్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టిక్కెట్ కోసం కొత్త ముఖాలు తెరపైకి వస్తున్నాయి. మరోవైపు సీనియర్లు అవకాశం కల్పించాలని అగ్రనేతల వద్ద మొర పెట్టుకుంటున్నారు. శాసనసభ, లోక్‌సభ ఎన్నికలు ముగిశాయి. మరో నాలుగేళ్ల రాష్ట్రంలో కీలకమైన ఎన్నికలు లేవు. కేవలం పరిషత్ ద్వారా మాత్రమే శాసనసభ్యులు అయ్యేందుకు అవకాశం ఉంది. దీంతో నియోజకవర్గాల వారిగా సీనియారిటీ, పార్టీకి చేసిన సేవలు, కులాల ప్రాతిపదికన అభ్యర్థులను నిర్ణయించే అవకాశం కనిపిస్తోంది. శాసనసభ్యుల కోటాలో 12 స్థానాలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. త్వరలోనే ఇందుకు సంబంధించి నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉంది. కాంగ్రెస్ నుంచి 8మంది గెలుపొందే అవకాశం ఉండగా బీజేపీ, జేడీఎస్‌లు 4 స్థానాలు దక్కించుకునే అవకాశం ఉంది. 8 మందిని ఎమ్మెల్సీలను చేసే అవకాశం ఉండడంతో సీనియర్లు ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. ఎమ్మెల్సీగా పేరు ఖరారైతే ఆరేళ్లపాటు కొనసాగవచ్చునని భావిస్తున్నారు. వీరిలో పార్టీ అధికార ప్రతినిధి, మీడియా ఇన్‌చార్జ్ రమేశ్‌బాబు, మాజీ సభాపతి యూఆర్ సుదర్శన్, సీనియర్ నేత బీఎల్ శంకర్, కేపీసీసీ మహిళా విభాగం అధ్యక్షురాలు పుష్ప అమరనాథ్, ప్రధాన కార్యదర్శి రామచంద్రప్ప, విజయ్ ముళగుంద, చిత్రదుర్గ మంజునాథ్, బాగేపల్లి మాజీ ఎమ్మెల్యే సంపంగి, బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్ ద్వారకనాథ్, మైసూరు లోక్‌సభ టిక్కెట్ ఆశించి భంగపడ్డ విజయ్‌కుమార్ ఉన్నారు. మాజీ ఎమ్మెల్సీలు ఐవాన్ డిసౌజా, ఉగ్రప్ప, వరుణ నియోజకవర్గానికి చెందిన ఎస్‌సీ మంజునాథ్, మాజీ ఎమ్మెల్యేలు హెచ్‌పీ మంజునాథ్, జీఎన్ నంజుండస్వామి, వీణా అచ్చయ్యతో పాటు పలువురు ఉన్నారు. ఇక సిద్దరామయ్య కుమారుడు యతీంద్ర పేరు కూడా ప్రధానంగా వినిపిస్తోంది.



దారితప్పిన శాంతిభద్రతలు

● కాంగ్రెస్ పాలనలో రౌడీలు, దోపిడీదారులకు పండుగ ● హోంశాఖను హైజాక్ చేశారు ● ప్రతిపక్షనేత అశోక్

బెంగళూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక శాంతిభద్రతలు దారి తప్పాయని, హోంశాఖ హైజాక్ అయ్యిందని ఇందుకు కాంగ్రెస్ పార్టీనే కారణమని ప్రతిపక్షనేత ఆర్. అశోక్ మండిపడ్డారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ హుబ్బళ్లిలో నేహా, అంజలి హత్యలను ప్రస్తావించారు. బహిరంగంగా చాకుతో పొడిచి చంపే కిరాతకం పెరిగిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రౌడీలు, దోపిడీదారులు, హంతకులకు పండుగ వాతావరణం వచ్చిందన్నారు. ఈ సంబరానికి కాంగ్రెస్సే కారణమని ఆరోపించారు. ఇటీవల అంజలి హత్యకు పాల్పడినవారిని ఉరితీయాలని కుటుంబీకులు డిమాండ్ చేస్తున్నారన్నారు. ప్రభుత్వమే అపరాధి స్థానంలో ఉందన్నారు. దేవరాజెగౌడ స్వయంగా డీకే శివకుమార్ వాయిస్ ఉన్న ఆడియోను విడుదల చేశారన్నారు. వాస్తవం లేకుంటే విడుదల చేయడం సాధ్యమా అని ప్రశ్నించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఈ అంశాన్ని తెరపైకి తేవడం ద్వారా లబ్ధి పొందవచ్చునని భావించారని, సీఎం సిద్దరామయియ్య, డీసీఎం డీకే శివకుమార్, సుర్జేవాలా మాస్టర్ ప్లాన్ వేశారన్నారు. సిద్దరామయ్య ఇప్పటికే దళిత నేతలను ముగించారని, ప్రస్తుతం ఒక్కలిగలను ముంచేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నారని ఆరోపించారు. ప్రజ్వల్ రేవణ్ణ వివాదాన్ని సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. అదే జరిగితే ప్రభుత్వంలోనివారు జైలుకు వెళ్లాల్సి ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో హోంశాఖనే హైజాక్ చేశారని ఆరోపించారు. మాజీ మంత్రి రేవణ్ణను అరెస్టు చేసిన సిట్ అధికారులు తన వద్దే పెన్‌డ్రైవ్‌లు ఉన్నాయని చెప్పినా కారు డ్రైవర్‌ను ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు. అంతకు ముందు మాజీ ప్రధాని దేవెగౌడ నివాసానికి వెళ్లిన అశోక్ ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



మాజీ ప్రధాని దేవెగౌడకు జన్మదిన శుభాకాంక్షలు చెబుతున్న ప్రతిపక్షనేత అశోక్

గిరీశ్ తప్పు చేశాడు.. శిక్ష పడాల్సిందే

● తల్లి సవితాసావంత్

బెంగళూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): తన కుమారుడు గిరీశ్ తప్పు చేశాడని, కోర్టు అతడికి ఎటువంటి శిక్ష అయినా వేయవచ్చునని తల్లి సవితాసావంత్ పేర్కొన్నారు. ధారవాడలో ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ అంజలి, గిరీశ్ ప్రేమించుకున్నారని పెళ్లి చేసుకుంటామని చెప్పారని తెలిపారు. కానీ ఇటీవల ఏం జరిగిందో ఇద్దరి మధ్య అభిప్రాయభేదాలు వచ్చాయన్నారు. ఈ స్థాయికి వెళ్తుందని ఊహించుకోలేదన్నారు. అంజలిని ప్రేమించానని, పెళ్లి చేసుకుంటానని చెప్పినప్పుడు ఇద్దరూ బాగుండాలని సూచించానన్నారు. ఆరు నెలల నుంచి గిరీశ్ ఇంటికి రాలేదన్నారు. అంజలి ఫోన్‌లో మరొకరితో మాట్లాడుతోందని చెప్పారన్నారు. ఇలా హత్య చేస్తాడని అనుకోలేదన్నారు. తన జీవనానికి గిరీశ్ ఎప్పుకూ ఒక్కరూపాయి కూడాఇవ్వలేదన్నారు. గతంలో దొంగతనం చేసినప్పుడు బుద్ధి చెప్పానన్నారు. ప్రస్తుతం బంధువులు ఎవరూ తనకు సాయం చేసేందుకు ముందుకు రావడం లేదన్నారు. తన కుమారుడిని చూసేందుకు కిమ్స్ ఆసుపత్రికి వెళ్లేది లేదని, బెయిల్‌తోపాటు ఎటువంటి సాయం చేసేందుకు ప్రయత్నించబోని తెలిపారు.



గిరీశ్ తల్లి సవితాసావంత్



నీలంకు ఘన నివాళి

బెంగళూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి జయంతి సందర్భంగా నగరంలోని కాక్స్‌టౌన్ కల్పల్లి స్మశానవాటికలో ఆయన సమాధి వద్ద ఆదివారం ఘనంగా నివాళులు అర్పించారు. మాజీ ఐఏఎస్ అధికారి, నీలం మనవడు డీవీఎస్ ప్రసాద్ పాల్గొని నీలం చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా స్థానిక సమాజసేవకుడు ఎన్ఎస్ రవి తదితరులు పాల్గొన్నారు.

నివాళి అర్పిస్తున్న నీలం మనవడు డీవీఎస్ ప్రసాద్ తదితరులు

పెన్‌డ్రైవ్ వివాదంతో సంబంధం లేదు

విచారణను దారి తప్పించేందుకే నా ప్రస్తావన : మాజీ ఎంపీ శివరామేగౌడ

బెంగళూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): హాసన్ ఎంపీ ప్రజ్వల్ పెన్‌డ్రైవ్ వివాదంతో తనకు ఎటువంటి సంబంధం లేదని మాజీ ఎంపీ శివరామేగౌడ తెలిపారు. బెంగళూరులో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పెన్‌డ్రైవ్ వివాదంలో తనకు ఎటువంటి సంబంధమే లేదన్నారు. అయినా తన పేరు ప్రస్తావన తెస్తున్నారని పేర్కొన్నారు. సిట్ విచారణను దారి తప్పించేందుకు ఇలాంటి ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. నలుగురు మంత్రులతో పెన్‌డ్రైవ్ రెడీ చేయించింది డీకే శివకుమార్ అని.. శివరామేగౌడ ద్వారా తనకు వంద కోట్ల ఆఫర్ చేశారని న్యాయవాది దేవరాజెగౌడ ఆరోపణలు చేసిన మేరకు శివరామేగౌడ వివరణ ఇచ్చారు. పెన్‌డ్రైవ్ బహిర్గతమయ్యేందుకు దేవరాజెగౌడ, కార్తీక్‌లే కారణమని పేర్కొన్నారు. దేవరాజెగౌడ తనకు ఫోన్ చేసి డీకే శివకుమార్‌ను భేటీ అయ్యేందుకు అవకాశం కల్పించాలని కోరారని తెలిపారు. దేవరాజెగౌడ ఏప్రిల్ 29న బెంగళూరులోని బౌరింగ్ క్లబ్‌లో తనను కలిశారని వివరించారు. ప్రస్తుతానికి బీజేపీకి రాజీనామా చేశానని, భవిష్యత్తులో ఏ పార్టీలో చేరతాననేది ప్రకటిస్తానన్నారు. తాను మొదట కాంగ్రెస్‌వాదినని, యూత్‌కాంగ్రెస్‌లో పనిచేశానని తెలిపారు.



నగరాన్ని ముంచెత్తిన వాన

బెంగళూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): నగర వ్యాప్తంగా రెండోరోజూ వాన పోటెత్తింది. శనివారం రాత్రంతా వాన కురిసింది. యలహంకతోపాటు పలు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఆదివారం ఉదయం నుంచే మేఘావృతం కొనసాగింది. మధ్యాహ్నం తర్వాత నగర వ్యాప్తంగా వాన కురిసింది. రాత్రి దాకా వర్షం కొనసాగింది. యలహంకలోని నార్త్‌హుడ్ అపార్ట్‌మెంట్ చుట్టూ నీరు నిండింది. వారం రోజులుగా రాజకాలువలో నీరు ప్రవహిస్తోంది. రాజకాలువ నీటితో 22 ఇళ్లల్లో నివసించేవారు ఇబ్బంది పడాల్సి వచ్చింది. పుట్టేనహళ్లి చెరువుకు నీరు చేరుతోంది. చిక్కమగళూరులోని హౌసింగ్‌బోర్డు లే అవుట్ కాంపౌండ్ కూలి ఐదు బైక్‌లు, రెండు సైకిళ్లు దెబ్బతిన్నాయి.



చామరాజపేట మక్కళకూట కూడలిలో వర్షం



వేర్వేరు కూడళ్లలో కురుస్తున్న వర్షం



చిక్కమగళూరులో గోడ కూలి దెబ్బ తిన్న వాహనాలు



వాన నుంచి రక్షణకు చిన్నారులతో ఇలా...





తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,577.54	1,578.78
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	41	1180
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	12	239
సామర్థ్యం (టీఎంసీలు)	3.39	3.91

ఆకట్టుకున్న స్థానిక 'సొబగు'



నృత్యం చేస్తున్న కళాకారులు

బళ్లారి సిటీ, మే 19: నగరంలోని సాంస్కృతిక సముదాయంలోని సుభద్రమ్మ మన్సూర్ రంగమందిరంలో శనివారం సాయత్రం నిర్వహించిన నెలవారీ శోభ (సొబగు) అందరిని ఆకట్టుకుంది. కన్నడ సాంస్కృతిక శాఖ సహకారంతో దీనిని నిర్వహించారు. ప్రతినెలా మూడవ శనివారం స్థానిక కళాకారులను ప్రోత్సహించేందుకు ఈనెలావారీ శోభ(సొబగు) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. సూర్యకళాట్రస్టు సాంస్కృతిక నృత్యాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. బళ్లారికి చెందిన శ్రీ గురు పుట్టరాజ సంగీత పాఠశాల సున్నిత సంగీతం శ్రోతలను ఆనందింపచేసింది. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, జిల్లాపంచాయితీ చీఫ్ ఆపరేటింగ్ అధికారి రాహుల్ శరణప్ప, కర్ణాటక హిస్టరీ అకాడమీ జిల్లా అధ్యక్షుడు టీ.హెచ్.ఎం.బసవరాజ్, జగదీష్, పలువురు కళాకారులు పాల్గొన్నారు.

గర్భాశయ క్యాన్సర్‌పై అవగాహన



మాట్లాడుతున్న ఎఫ్‌పీఏఐ మేనేజర్ విజయలక్ష్మి

బళ్లారి సిటీ, మే 19: గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌పై మహిళలు అవగాహన కలిగిఉండి, నివారణకు చెక్ పెట్టాలని ఎఫ్‌పీఏఐ శాఖ మేనేజర్ శ్రీమతి విజయలక్ష్మి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఫ్‌పీఏఐ ఆర్థిక సలహాదారు భాగ్య మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. వ్యాధి రాకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. మహిళలకు హెచ్‌పీవీ వ్యాక్సీన్ అవశ్యకతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్‌వైఎంఈసీ కళాశాల నుంచి 40మంది మహిళలు పాల్గొన్నారు.

జోరుగా బీజేపీ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



ప్రచారంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప

సిరుగుప్ప, మే 19: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప, బీజేపీ కార్యకర్తలు.. ఓటర్లను కలిసి పార్టీ అభ్యర్థికి ఓటు వేసి, గెలిపించాలని కోరారు. ఎమ్మెల్సీ అభ్యర్థి అమర్‌నాథ్ పాటిల్ తరపున ప్రచారం చేపట్టారు. తాలుకాలో 3,323 మంది ఓటర్లు వున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరు బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని వారు ఓటర్లను అభ్యర్థించారు.

ఘనంగా ఉచ్చీరప్ప తాతకు పూజలు



అలంకరణలో ఉచ్చీరప్ప తాత

సిరుగుప్ప, మే 19: ఘనంగా ఉచ్చీరప్పతాతకు ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. సిరుగుప్ప పట్టణం 24వ వార్డులో వెలసిన ఉచ్చీరప్ప తాతకు ప్రధాన అర్చకులు ఉచ్చీరప్ప ఆచారి ధూపదీపనైవేద్యములతో పూజలు జరిపారు. స్వాముల వారికి ప్రత్యేకాలంకరణ, పుష్పాలంకరణ, ఆకుపూజ నిర్వహించారు.

అడుగడుగునా అడ్డంకులే!

- రైతుల నుంచి పన్ను వసూలు చేస్తూ పంటకాలువల మరమ్మతు మరిచిన అధికారులు
- ఆయకట్టుకు నీరందడం గగనమే



పంటకాలువలో పెరిగిన కంపచెట్లు

బళ్లారి, మే 19(ఆంధ్రజ్యోతి): ఆయకట్టు భూములకు నీరందించే పంట కాలవలు అధ్వాన్నస్థితిలో ఉన్నాయి. వాటికి మరమ్మతులు చేసి నీరు సక్రమంగా పారేలా చూడాల్సిన ప్రభుత్వ అధికారులు పెద్దగా పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏటా రైతు నుంచి భూమి పన్ను వసూళ్ల చేస్తున్నా రైతుల పొలాలకు నీరందించే కాలువల మరమ్మతులు చేయడం లేదని రైతులు అంటున్నారు.

తుంగభద్ర జలాశయం కింద బళ్లారి, కొప్పళ, రాయచూరు, విజయనగర జిల్లాల్లో సుమారు 2లక్షల హెక్టార్ల ఆయకట్టు భూమి సాగవుతుంది. ప్రధాన కాలువలతో పాటు పంట కాలవలను కూడా ఆధునికీకరించి రైతు పొలాలకు నీరందించాలి. రైతుల నుండి వసూళ్ల చేసిన శిస్తుతో పంట కాలవలు, తూములు, క్రష్ గేట్లు మరమ్మతులు చేయాల్సి ఉంటుంది. మే నెలలో పంట కాలువ గట్లపై ఉండే కంపచెట్లు తొలగించి కాలువను నీటి పారుదలకు అనుకూలంగా మార్చాలి. అలాగే పొలాలకు రాకపోకలు సాగించేందుకు రోడ్లు కూడా బాగు చేయాల్సి ఉంటుంది. కాని ఇలా ఏమీ చేయకుండా అధికారులు మౌనంగా ఉండిపోతున్నారు. కొన్నిచోట్ల నామకేవాస్తేగా పనులు చేసి బిల్లులు మింగేస్తున్నారనే విమర్శలూ ఉన్నాయి. మరి కొన్ని చోట్ల రైతులు పొలాలకు నీరు ఉపయోగించే తూములు, అంతాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వాస్తవానికి నీటి కొలతను అంతాలు ద్వారానే లెక్కగడుతారు. ఇవి పూర్తిగా ధ్వంసం కావడంతో రైతులు వారి పొలాలకు రావాల్సిన నీటి వాటా సరిగా రావడం లేదని దిగులు చెందుతున్నారు. పంట కోత సమయంలోనూ అలాగే పంటల సాగు సమయంలోను, వెళ్లేందుకు దారులు లేక రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఎప్పుడో పూర్వం వేసిన దారులే కానీ ఈమధ్య ఏ దారికీ మరమ్మతులుచేయని కారణంగా దారులు అధ్వానంగా మారాయి.

విజయనగర, బళ్లారి, కొప్పళ జిల్లాల పరిధిలోని కొన్నిగ్రామాల మధ్యలో ఉండే కాలువల్లో వ్యర్థ పదార్థాలు పారేయడం వల్ల నీటి పారుదలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. సాగు సమయంలో పంట కాలువ నుండి పొలాలకు నీరు సక్రమంగా రాని కాని కారణంగా పంట దిగుబడిపై ఆ ప్రభావం పడుతుంది. ప్రస్తుతం సాగుకు పంట పొలాలు సిద్ధం చేసుకుంటున్న సమయంలో పంట కాలువలు కూడా మరమ్మతు చేయాలని రైతులు అధికారులను కోరుతున్నారు.

కంప్లి తాలూకాలో జోరుగా సేద్యం పనులు

కంప్లి, మే 19 : తాలుకాలో గత ఐదారు రోజులుగా కురుస్తున్న వర్షాలకు భూములు తడవడంతో రైతన్నలు ముందుకొచ్చి దుక్కిదున్ని సేద్యం పనులను జోరుగా చేసుకుంటున్నారు. కంప్లి నియోజకవర్గంలో దేవసముద్రం, మెట్రి దేవలాపురం, జవుకు, కురుగోడు, ఎమ్మిగనూరు, తదితర ప్రాంతాల్లో ఖరీఫ్ సాగుకు పొలాలను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే పొలాల్లో పిచ్చి మొక్కలు, రాళ్లు, రప్పలు తొలగిస్తూ ట్రాక్టర్ల ద్వారా పొలం పనులు చేసుకుంటున్నారు. బళ్లారి జిల్లాతో పాటు విజయనగర జిల్లాలోని మరెమ్మనహళ్లి, హగరి బొమ్మనహళ్లి, కొట్టూరు, హరప్పనహళ్లి, కూడ్లిగి, తదితర చోట్ల కూడా రైతన్నలు ఖరీఫ్ పనుల్లో నిమగ్నమయ్యారు.



సోమలాపురం, జవుకు మధ్య పొలంలో దుక్కిదున్నుతున్న రైతు

చల్లబడిన నగరం

బళ్లారిరూరల్, మే 19: బళ్లారి నగరం ఆదివారం సాయంత్రం అరగంటపాటు కురిసిన వర్షంతో చల్లబడింది. గత కొద్ది రోజులుగా ఎండవేడిమి, ఉక్కపోతతో ఇబ్బందులకు గురవుతున్న నగర వాసులు సంతోషం వ్యక్తం చేస్తూ ఉక్కపోత నుండి ఉపశమనం పొందినట్లు తెలిపారు.

యోగా, డైట్‌తో మధుమేహం దూరం



యోగా శిబిరంలో మాట్లాడుతున్న హంద్రాల తదితరులు

హొసపేట,మే 19: మధుమేహం వ్యాధి కాదని, క్రమశిక్షణలేని జీవనశైలి ఇందుకు కారణమని పతంజలి యోగా సమితి గదగ్, విజయనగరం జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ హంద్రాల అన్నారు. యోగా. సరైన ఆహారం క్రమశిక్షణతో కూడిన జీవనశైలి వల్ల మధుమేహం లేకుండా పోతుందన్నారు. హొసపేటలోని ఇండిపెండెన్స్ గార్డెన్‌లో ఆదివారం ఉదయం మధుమేహ నియంత్రణ అంశంపై ప్రత్యేక యోగా శిబిరాన్ని నిర్వహించి ఆయన మాట్లాడారు. యోగా ప్రదర్శనల ద్వారా మధుమేహాన్ని ఎలా దూరం చేసుకోవచ్చో సూచించారు. మధుమేహం కోసం బయటనుండి ఇన్సులిన్ తీసుకోవాల్సి ఉంటుందని అయితే వివిధ యోగాసనాలు, ప్రాణాయామం సరైన ఆహారం క్రమశిక్షణతో కూడిన జీవనశైలితో మధుమేహాన్ని నియంత్రించవచ్చని తెలిపారు. మనుసులోని చింతలే వ్యాధికి మూలమన్నారు. ఎప్పుడూ ఆనందంగా ఉంటే ఏ రోగం దగ్గరికి వచ్చినా అదుపులో ఉంటుందన్నారు. ఈసందర్భంగా యోగా సమితి యువజన రాష్ట్ర ఇన్‌చార్జి కిరణ్ కుమార్, యోగా అబ్యాసకులు రాజేశ్ కర్వా, హల్లికేరి, అనంతజోషి, నిర్వాహకులు శ్రీరామ్, ప్రకాశ్ కులకర్ణి, శ్రీధర్, శివమూర్తి, మంగళమ్మ, ప్రమీలమ్మ, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అందజేత

బళ్లారిరూరల్, మే 19 : బళ్లారి నగరంలోని గాంధీ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ, అడిషనల్ ఎస్పీ నేతృత్వంలో సిటీ డీఎస్పీ చంద్రకాంత్ నందరెడ్డి ఆదేశాలతో దాదాపు నగరంలో 20 సెల్‌ఫోన్లను టీఈఐఆర్ ద్వారా ప్రజలు పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకుని పోగొట్టుకున్న వారికి తిరిగి ఇచ్చారు. ఈ సెల్‌ఫోన్లను సిటీ డీఎస్పీ చంద్రకాంత్‌నందరెడ్డి, సీఐ ధర్మకర్ ధర్మట్టిలు పోగొట్టుకున్న వారి కుటుంబీకులను పిలిపించి వారికి అందజేయడంతో వారు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మీరు సెల్‌ఫోన్లు పోగొట్టుకుంటే సీఈఐఆర్.జీవోవి.ఇన్ పోర్టల్‌ను సంప్రదించి సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజలు పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను తిరిగి వారికి అప్పగిస్తున్న పోలీసులు

హంపికి పోటెత్తిన పర్యాటకులు



రాతిరథాన్ని వీక్షిస్తున్న పర్యాటకులు

కంప్లి, మే 19 : దక్షిణ కాశీగా పేరుపొందిన హంపీకి పొరుగు రాష్ట్రాల నుంచి పర్యాటకులు పోటెత్తారు. ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో పాఠశాలలకు సెలవులు వుండటంతో వారంరోజులుగా హంపికి పర్యాటకులు తరలివస్తున్నారు. హంపిలో ప్రసిద్ధి గాంచిన యంత్రోత్పాదక ఆంజనేయస్వామి దేవాలయం, కోదండరామ దేవస్థానం, విజయవిఠల, రాతిరథం, కోనేరు, నవమిదిబ్బ, హంపి విరుపాక్షేశ్వరాలయం, తదితర ప్రదేశాలను వీక్షిస్తున్నారు. రెండు మూడురోజులుగా ఈ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నా లెక్కచేయకుండా పర్యాటకులు వస్తున్నారు.

పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు



ఆటో, బైక్‌ను స్వాధీనం చేసుకున్న కర్ణాటక పోలీసులు

గోరంట్ల, మే 19: పట్టణంలోని ప్రధాన రహదారిపై స్టేట్ బ్యాంక్ వద్ద కర్నాటక పోలీసులు ఆటోద్విచక్రవాహనంతోపాటు ముగ్గురు వ్యక్తులను ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. మఫ్టీ దుస్తుల్లో ఎర్రరంగుకారులో వచ్చిన కర్నాటక పోలీసులు గోరంట్లలోని బ్యాంక్ వద్ద నెంబర్ ప్లేట్లులేని ఆటో, డియో స్కూటీనీ గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులను ఆదివారం మధ్యాహ్నం దాడిచేసి పట్టుకున్నారు. జనసంచారం అధికంగా ఉన్నప్రాంతంలో పోలీసులు దాడిచేసి పట్టుకోవడం పట్ల ప్రజలు ఆశ్చర్యనికి గురైయ్యారు. కర్నాటక పోలీసులు వెంట, స్థానిక పోలీసులు లేకపోవడం, తరువాతకూడా స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎలాంటి సమాచారం ఇవ్వలేదనితెలిసింది. దొంగలించిన ఆటో, స్కూటీని వెంబడిస్తూ వచ్చి పట్టుకుని, తీసుకెళ్లినట్లు సమాచారం. ఈవిషయంపై గోరంట్ల పోలీసులను విచారించగా, తమకు ఎలాంటి సమాచారం అందలేదన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

కంప్లి, మే 19 : కంప్లి పట్టణ 110 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో సోమవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం వుంటుందని ఏఈఈ దయానంద తెలిపారు. విద్యుత్ మరమ్మతు పనులు జరుగుతుండటం వలన విద్యుత్ సరఫరాలో అంతరాయం వుంటుందని తెలిపారు. కావున ప్రజలు ఇది గమనించి సహకరించాలని కోరారు.

జోరుగా రోడ్డు పనులు



సుగ్గినహళ్లి వద్ద చేపడుతున్న రోడ్డు పనులు

కంప్లి, మే 19 : తాలుకా పరిధిలోని దేవలాపురం నుండి సుగ్గినహళ్లి వరకు రోడ్డు పనులు వేగంగా కొనసాగుతున్నాయి. గతంలో ఈ రోడ్లు గుంతలమయంగా వుండటంతో వాటి మరమ్మతుకు ఎమ్మెల్యే నిధులు మంజూరుచేశారు. దీంతో రోడ్డు పనులు జోరుగా సాగుతున్నాయి.

కొవిషీల్డ్ వ్యాక్సిన్ బాధితుడిని ఆదుకోవాలి

రాయచూరు, మే 19 : ప్రాణాంతక కోవిడ్ వ్యాధి నియంత్రణ కోసం కోవిశీల్డ్ వ్యాక్సిన్‌ను పొంది దాన్ని సైడ్ ఎఫెక్ట్ వల్ల రోగాలబారిన పడిన బాదితుడు గజ్జలగట్ట గ్రామస్థుడు హుసేనప్పకు ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ(ఎంఎల్) రెడ్‌స్టార్ పార్టీ పోలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.మానసయ్య డిమాండ్ చేశారు. కోవిశీల్డ్‌తో పాటు కోవ్యాక్సిన్ పొందిన వారు సహితం ఇటీవల అనేక సైడ్ ఎఫెక్ట్‌తో అనారోగ్యం బారినపడుతున్నారని వీటిపై సమగ్ర విచారణ జరిపించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ఆదివారం నగరంలోని పెకరస్‌క్లబ్‌లో విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. కోవిడ్ సందర్భంగా గజ్జలగట్ట గ్రామానికి చెందిన హుసేనప్పకు కోవిశిల్డ్ వ్యాక్సిన్ ఇవ్వగా మూడేళ్ల అనంతరం వివిధ అనారోగ్య సమస్యలతో ఆయన నగరంలోని రిమ్స్ ఆస్పత్రిలో చేరాడన్నారు. ఆస్పత్రిలో పరీక్షలు నిర్వహించిన వైద్యులు ఆయనకు కోవివిల్డ్ తీసుకోవడం వల్ల దాన్ని సైడ్ ఎఫెక్ట్ ప్రభావంతో తలనొప్పి, పొట్ట పట్టి, వాంతులు విరేచనాలు వంటి వికారాలతో అనారోగ్యానికి గురైనట్లు తెలిపారన్నారు. దీంతో పాటు పలు గ్రామాల్లో కోవ్యాక్సిన్ పొందిన వారికి సహితం ఇదే రకమైన వ్యాధి లక్షణాలు కనిపిస్తున్న నేపధ్యంలో అధికారులు అప్రమత్తం కావాలన్నారు. 2020వ సంవత్సరం కోవిడ్ వ్యాధితో అల్లాడిపోగా మూడేళ్ల అనంతరం కోవ్యాక్సిన్, కోవిశిల్డ్ పొందిన వారు సైడ్ ఎఫెక్ట్‌తో ఆందోళనకు గురవుతున్నారన్నారు.

హోసూరు జోన్

భక్తిశ్రద్ధలతో శ్రీవారి కల్యాణోత్సవం



శ్రీదేవి, భూదేవి అమ్మవార్లతో శ్రీవారికి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

హోసూరు మే 19 : హోసూరు సమీపంలోని గోపసంద్రం కొండపై ఉన్న దక్షిణ తిరుపతి దేవస్థానంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి తిరుకల్యాణోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ ఆలయంలో ప్రత్యేకించి శనివారాల్లో ప్రత్యేక పూజలు, అలంకరణలు జరుగుతాయి. తిరుకల్యాణంలో ఉదయం అమ్మవారికి పాలు, పెరుగు, నెయ్యి, కొబ్బరినీళ్లతో అభిషేకం చేశారు. అనంతరం అన్నమయ్య కీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో హోసూరు తాలూకా శూలగిరి తాలూకా, డెంకణీకోట తాలూకా, బెంగళూరు ప్రాంతం నుంచి వేలాది మంది పాల్గొన్నారు. అందరికీ తీర్థప్రసాదాలు అందజేశారు. కామన్ దొడ్డి వెంకటేశ్ పద్మావతి పర్యవేక్షించారు.

వేణుగోపాల స్వామి ఆలయంలో చోరీ

హోసూరు, మే 19: హోసూరు సమీపాన బేరికై పక్కన అత్తిముగంకు చెందిన వేణుగోపాల ఆలయంలో చోరీ జరిగింది. ఆదివారం ఉదయం యథా ప్రకారం ఆలయానికి అర్చకుడు చేరుకోగా తాళాలు పగులగొటింటనట్టు గుర్తించారు. ఎప్పటిలాగే ఆదివారం కూడా తాళాలు తీసి పూజలు చేసేందుకు వెళ్లినప్పుడు తాళాలు బద్దలుగొట్టి వుండడంతో చూసి షాక్‌కు గురయ్యాడు. ఆలయంలో పూజాసామగ్రి దోచుకెళ్లినట్లు తెలిసింది. దీనిపై ఆయన బేరికై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వాసవీదేవి ఆలయంలో విశేషపూజలు

హోసూరు, మే 19: హోసూరులో వాసవి జయంతి సందర్భంగా కన్యకా పరమేశ్వరీ అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొని కుంకుమార్చన చేశారు. ఎంజీ రోడ్డులోని కన్యకా పరమేశ్వరి దేవాలయం సమీపంలోని ఎస్‌కేవీడీ కల్యాణమండపంలో చారిటబుల్ ఆర్గనైజేషన్, ఆర్య వైశ్య ట్రస్టు ఆధ్వర్యంలో వాసవీ జయంతి వేడుకలు నిర్వహించారు. పూజల్లో హోసూరు మున్సిపాలిటీ మాజీ ఛైర్మన్ నంజుండస్వామి, బాలాజీ పలువురు భక్తులు పాల్గొన్నారు. తర్వాత కళ్యాణమంటపంలో జరిగిన వేడుకల్లో 500 మంది మహిళలు పాల్గొన్నారు. స్వచ్ఛంద సంస్థ ఉపాధ్యక్షుడు నంజుండస్వామి, కార్యదర్శి లక్ష్మిగోవిందరాజు, వివేక్ ప్రారంభించారు. ఇందులో లోకకళ్యాణంకోసం పూజలు జరిపారు. అనంతరం అన్నదానం చేశారు. ఇందులో ఆర్యవైశ్య ట్రస్టు అధ్యక్షుడు ప్రభు, కార్యదర్శి మనోహర్, హోసూరు వాసవీ క్లబ్ వనితా ఎలైట్ అధ్యక్షురాలు సరోజాబాబు, కార్యదర్శి సుధారాణితో పాటు పలువురు పాల్గొన్నారు.



పుష్పాలంకరణలో కన్యకాపరమేశ్వరి

కోడ్ ముగిశాక సమస్యలు ప్రభుత్వం దృష్టికి..



సమావేశమైన వాణిజ్యోద్యమ సంఘం ప్రతినిధులు

రాయచూరు, మే 19: జిల్లాలవ్యాప్తంగా పరిశ్రమల యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకోరావాలని అంతర్ జిల్లా వాణిజ్యోద్యమ సంఘం ప్రతినిధులు నిర్ణయించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపధ్యంలో కోడ్ ముగిసిన అనంతరం ప్రతినిధుల బృందం బెంగళూరుకు వెళ్లి ప్రభుత్వానికి సమస్యలపై వినతి పత్రం ఇవ్వాలని నిర్ణయించారు. ఆదివారం నగరంలోని ఒక ప్రైవేటు హోటల్‌లో కల్యాణ-కర్ణాటక ప్రాంతాల వివిధ జిల్లాలకు చెందిన పారిశ్రామిక వేత్తలు అంతర్‌జిల్లా సమావేశం నిర్వహించారు. సమావేశంలో మాట్లాడిన జిల్లా అధ్యక్షుడు కమల్ కుమార్ పరిశ్రమలకు ప్రభుత్వ ఆదేశాల మేరకు చట్టం ఆధారంగా స్థానికంగానే పన్నులు విధిస్తున్నప్పటికి పలు జిల్లాల్లో అనేక సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. స్థానికంగా ఉండే సమస్యల ఆధారంగా వనరులు, యాజమాన్యాలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించే దిశగా త్వరలోనే ప్రభుత్వానికి ఒక వినతి పత్రం ఇవ్వాలని నిర్ణయించామన్నారు. జిల్లాల్లో పరిశ్రమల అభివృద్ధి కోసం ప్రభుత్వ పరంగా అందాల్సిన సౌకర్యాలు, ఆర్థికంగా పరిశ్రమల యజమానులు ఎదుర్కొంటున్న సమస్యల పై ప్రభుత్వానికి నివేదించాలని నిర్ణయించామని ఆయన వివరించారు. పరిశ్రమల యజమానులు ఒక్కో జిల్లాలో ఒక్కో రకమైన సమస్యలు ఎదుర్కొంటున్నారని ఈ విసయాలన్నింటిని పొందుపరిచి ప్రభుత్వానికి అందజేస్తామన్నారు.

బస్సులు ఆపాలని రాస్తారోకో

రాయచూరు, మే 19: జిల్లాలోని సింధనూరు తాలూకా జవళగేరా వద్ద ఆదివారం జరిగిన రాస్తారోకోతో వాహనదారులు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. జవళగేరా వద్ద వేగదూతతోపాటు అన్ని రకాల బస్సు సర్వీసులను నిలపాలని, స్టాప్ ఏర్పాటు చేయాలని గ్రామస్థులు, విద్యార్థులు డిమాండ్ చేశారు. జవళగేరా వద్ద అనేక బస్సులు స్టాప్ లేకుండా వెళుతుండడంతో విద్యార్థులు వివిధ అత్యావసర పనుల కోసం అటు సింధనూరు ఇటు రాయచూరు. మాన్వి వైపు వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

టంగుటూరి ప్రకాశం పంతులు (వర్ధంతి)



'ఆంధ్రకేసరి' టంగుటూరి ప్రకాశం పంతులు 1872 ఆగస్టు 23న ఇప్పటి ప్రకాశం జిల్లా వినోదరాయునిపాలెంలో జన్మించారు. స్వాతంత్ర్య సమర యోధుడు, మద్రాస్ ప్రెసి డెన్సీలో 1946-47, స్వాతంత్ర్యానంతరం 1953-54 మధ్య ముఖ్యమంత్రిగా వ్యవహ రించారు. నిరుపేద కుటుంబంలో జన్మించి వారాలు చదువుకుని ముఖ్యమంత్రి అయిన ధీరోదాత్తుడు. క్విట్ ఇండియాలో పాల్గొని అరెస్టు అయి స్వాతంత్ర్యానంతరం ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధనలో కీలకపాత్ర పోషించారు. మద్రాసులో సైమన్ కమిషన్ వ్యతిరేక ప్రదర్శనలు తుపాకీకి ఎదురుగా నిలిచి 'ఆంధ్ర కేసరి'గా పేరొందారు. 1957 మే 20న కన్నుమూశారు. ఆయన సేవలకు గుర్తుగా 1972లో ఒంగోలు జిల్లా పేరును ప్రకాశం జిల్లాగా మార్చారు.

పరమాచార్య చంద్రశేఖర స్వామి (జయంతి)



కంచికామకోటి పీఠానికి 68వ పీఠాధిపతిగా వ్యవహరించి జగద్గురుగా పేరొందిన చంద్రశేఖరానంద సరస్వతి స్వామి 1894 మే 20న తమిళనాడు రాష్ట్రం విల్లుపురంలో జన్మించారు. అసలు పేరు స్వామినాథన్. 18వ యేట సన్యాసం స్వీకరించిన అనంతరం చంద్రశేఖర సరస్వతిగా మారారు. వేదాలు, పురాణాలు, సాహిత్యంలో రాణించారు. ఆదిశంకరాచార్య మార్గంలో సాగారు. ధర్మం, సంప్రదాయాలను దేశవ్యాప్తంగా విస్తృతం చేశారు. కామాక్షిదేవి ఆలయంతోపాటు ఇతర ఆలయాల జీర్ణోద్ధరణకు సహకరించారు. 1994 జనవరి 8న పరమపదించారు.

ఎండీ రామనాథన్ (జయంతి)



'పద్మశ్రీ' గ్రహీత మంజపర దేవేశ భాగవతార్ (ఎండీ) రామనాథన్ 1923 మే 20న కేరళ రాష్ట్రం పాలక్కాడ్ (పాల్ఘాట్) జిల్లా మంజపర గ్రామంలో జన్మించారు. కర్ణాటక సంగీత విద్వాంసులు, గాయ కులు. భావ, లయలలో తన దైన ప్రతిభను చాటుకున్నారు. కళాక్షేత్రలో ప్రారంభ మైన 'సంగీత శిరోమణి' తొలి బ్యాచ్‌లో ఉత్తీర్ణుడైన ఏకైక విద్యార్థి. సంగీత కళాశాల ప్రొఫెసర్‌గా రాణించారు. తమిళ, తెలుగు, సంస్కృతంలో 300కు పైగా పాటలకు కర్ణాటక సంగీతాన్ని స్వర పరిచారు. గురువు టైగర్ వరదాచారిపై గౌరవంతో తన కృతులలో 'వరద దాస' అనే పదాన్ని ముద్రగా వాడుకున్నారు. సంగీత నాటక అకాడమీ అవార్డు, సంగీత కళాసింగమణి తదితర అవార్డులు పొందారు. 1984 ఏప్రిల్ 27న కన్నుమూశారు.

బాలు మహేంద్ర (జయంతి)



బాలనాథన్ బెంజమిన్ మహేంద్రన్ 1939 మే 20న శ్రీలంకలో జన్మించారు. దేశంలో సినీ రంగంలో సినిమాటోగ్రాఫర్‌గా, స్క్రీన్ రైటర్‌గా, ఎడిటర్‌గా రాణించారు. దక్షిణాదిన ప్రత్యేకించి తమిళ సినీ ఇండస్ట్రీలో ట్రెండ్‌సెట్టర్‌గా నిలిచారు. 1977లో 'కోకిల' కన్నడ సినిమాకు దర్శ కత్వం వహించారు. 6 జాతీయ సినీ అవార్డులు, 5 ఫిల్మ్‌ఫేర్ అవార్డులు అందుకున్నారు. చెన్నైలో ఫిల్మ్‌స్కూల్‌ను ఏర్పాటు చేసి దర్శకత్వం, నటన, సినిమాటోగ్రఫీపై నేర్పించేవారు. 2014 ఫిబ్రవరి 13న కన్నుమూశారు.

సిరివెన్నెల సీతారామ శాస్త్రి (జయంతి)



'సిరివెన్నెల' సినిమా పేరుతోనే గుర్తింపు పొందిన చేంబోలు సీతారామ శాస్త్రి 1955 మే 20న విశాఖపట్నం జిల్లా అనకాపల్లెలో జన్మించారు. సినీ గేయ రచయిత. 'విధాత తలపున ప్రభవించినది...' ఆయన రాసిన తొలిపాట సినీ అభిమానుల గుండెల్లో పదిలంగా నిలిచింది. 11 నంది అవార్డులు, 4 సినిమా అవార్డులు అందుకున్నారు. 3వేలకు పైగా పాటలు రాశారు. 2019లో పద్మశ్రీ పురస్కారం పొందారు. 2021 నవంబరు 30న కన్నుమూశారు.

జూనియర్ ఎన్టీఆర్ (పుట్టినరోజు)



నందమూరి తారకరామారావు 1983 మే 20న జన్మించారు. తెలుగు సినీ రంగంలో అత్యధిక పారితోషికం అందు కుంటున్న నటులలో ఒకరు. స్వర్గీయ ఎన్టీఆర్ మనవడు, నందమూరి హరికృష్ణ కుమారుడు. తాతకు తగ్గ మనవడు అనిపించుకున్నారు. బ్రహ్మర్షి విశ్వామిత్ర సినిమాలో బాలనటుడిగా నటించారు. 20 ఏళ్ల సినీ జీవితంలో పలు హిట్ సినిమాలలో నటించారు. నటన, డైలాగ్ చెప్పడంలో, రిహార్సల్స్ లేకుండా నృత్యాలు సింగిల్ టేక్‌లో తీసుకోవడం ఆయన ప్రత్యేకత. రెండు రాష్ట్ర నంది అవార్డులు, ఫిల్మ్‌ఫేర్, నాలుగు సినిమా అవార్డులు అందుకున్నారు. బుల్లితెరపై బిగ్‌బాస్ వంటి కార్యక్రమాలకు హోస్ట్‌గా వ్యవహరించారు. అభిమానులు ముద్దుగా 'తారక్' అని పిలుస్తారు. ఆర్ఆర్ఆర్ సినిమాలోని 'నాటు నాటు' పాట ఉత్తమ ఒరిజినల్ సాంగ్‌గా ఆస్కార్ అవార్డు గెలుచుకుంది.

విద్యతోనే సమాజ ప్రగతి సాధ్యం

శిడ్లఘట్ట, మే 19: విద్యతోనే సమాజప్రగతి సాధ్యమని రిటైర్డు అధ్యాపకుడు, ఆర్యవైశ్య మహాసభ డైరెక్టర్ కైవార అమరనాథ్ గుప్త అభిప్రాయపడ్డారు. వాసవి కన్యకాపరమేశ్వరి జయంతిలో భాగంగా ఆదివారం ఏర్పాటైన సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో విద్యలో ముందంజలో ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అలాగే అన్నింటికీ ప్రభుత్వ ఉద్యోగమే కావాలన్న ధోరణి వీడి స్వావలంబన దిశగా బతికేందుకు ప్రయత్నించాలన్నారు. ఏ సామాజికవర్గం ప్రగతి సాధించాలన్నా ఆ మేరకు స్వావలంబన కీలకమైనదన్నారు. నేటి రోజుల్లో అభివృద్ధికోసం ఎన్నో అవకాశాలను ఆర్యవైశ్య మహాసభ కల్పిస్తోందన్నారు. ఆర్థికంగా, సామాజికంగాను, స్వయం ఉపాధికి తర్ఫీదు ఇస్తోందని స్వదేశీ, విదేశాల్లో సహా ప్రతిభాన్వితులకు యువకులకు అవకాశం కల్పిస్తోందని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్యవైశ్య మండలి, వాసవి మహిళా మండలి, వాసవి యువజన సంఘం సంయుక్తంగా వాసవి జయంతిలో భాగంగా ప్రతిభా పురస్కారాల ప్రదానం నిర్వహించారు. అమరనాథ గుప్త మాట్లాడుతూ ప్రస్తుతం మన సమాజవృత్తి అయిన వ్యాపారంలోనూ పోటీ నెలకొందన్నారు. ఈ నేపథ్యంలో యువకులకు అవకాశాలు కల్పించేలా విద్యరంగంలో కొనసాగించేందుకు ఆర్థిక సాయం చేస్తోందన్నారు. అలాగే వడ్డీ రహిత రుణాలు, స్వయం ఉపాధికి ఉచిత తర్ఫీదు, పెద్ద పారిశ్రామికవేత్తల ద్వారా ఫ్యాక్టరీల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన ప్రతిభావంత విద్యార్థులకు



ప్రతిభాపురస్కారాలతో విద్యార్థులకు సన్మానం

ల్యాప్‌టాప్ ఇస్తున్నట్టు తెలిపారు. సామాజికవర్గంలోని వృద్ధులకు పింఛను, వితంతు పింఛను దివ్యాంగులకు మాసిక పింఛను ఇతరత్రా సామాజిక సేవలు కొనసాగిస్తున్నట్టు తెలిపారు. 2023-24 విద్యాసంవత్సరంలో పోటీ పరీ క్షల్లో రాణించిన విద్యార్థులను సత్కరించారు. ఆర్యవైశ్య మండలి అధ్యక్షుడు కృష్ణయ్య శెట్టి అధ్యక్షత వహించగా వాసవి విద్యాసంస్థ పాలనాధికారి రూపసి రమేశ్ ప్రారంభ ఉపన్యాసం చేశారు. కార్యక్రమంలో దాతలు విజయలక్ష్మి, గోపాల కృష్ణ, శేషానంద, మురలీధరన్, మంజునాథ్‌లను సన్మానించారు. కార్య క్రమంలో టీఎస్‌కే బాబు, గజలక్ష్మి, సందీప్‌రాజ్, శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవం



పూజల్లో పాల్గొన్న భక్తులు

శిడ్లఘట్ట, మే 19: పట్టణంలోని నగర్తపేటలో కొలువైన కాళికాంబ కమఠేశ్వర దేవాలయంలో కాలజ్ఞాని వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనా మహోత్సవం ఆదివారం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఆలయశుద్ధి అనంతరం స్వామివారికి అభిషేకం నిర్వహించారు. అమ్మవారికి విశేష అలంకరణ చేశారు. వీరబ్రహ్మేంద్రస్వామి రచించిన కాలజ్ఞనంలోని ఎన్నో అంశాలు నిజమైనట్టు తెలుస్తోంది. కడపజిల్లా బ్రహ్మంగారి మఠం ప్రాంతంలో ఆయన జీవసమాధి అయ్యారు. వీరభోగవసంతరాయులుగా మళ్లీ జన్మిస్తానని పేర్కొనడం గమనార్హం. ఆ సమయానికిపై భూమిపై అస్తవ్యస్థ పరిస్థితులు ఉంటాయని భవిష్యత్తు చెప్పడం విశేషం. ఉత్సవంలో విశ్వకర్మ సంఘం తాలూకా అధ్యక్షుడు అమర నారాయణచారి, గౌరవాధ్యక్షుడు జనార్ధన్‌మూర్తి, కాళికాంబ దేవాలయ సమితి అధ్యక్షుడు మునిరత్నచారి, కార్యదర్శి జగదీశ్, ఉపాధ్యాయులసంఘం కోశాధికారి సుందరాచారి, దిబ్బూరహళ్లి శివశంకరాచారి, వెంకటాచారి, కసాప మాజీ అధ్యక్షుడు కేఎం వినాయక తదితరులు పాల్గొన్నారు.

విజయపురలో...

విజయపుర, మే 19: భూత భవిష్యత్తు వర్తమానాలను తన తపశ్శక్తితో అలవోకగా చెప్పగల్గి కాలజ్ఞానం సహా పలు రచనలతో ప్రజల్లో చైతన్యం తెచ్చిన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. పట్టణంలోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో స్వామికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ సంస్థాపకులు చంద్రశేఖరాచార్ నేతృత్వంలో పూజాకైంకర్యాలు సాగాయి. అనంతరం పురవీధులలో ఉత్సవమూర్తిని ఊరేగించారు. మంగళవాయిద్యాలు, వీరగాసె కుణిత బృందాలు సందడి చేశాయి. విశ్వకర్మ క్షేమాభివృద్ధి సంఘం అధ్యక్షుడు బీఎస్ రాజశేఖరాచారి, కార్యదర్శి పురుషోత్తమ్, కోశాధికారి గోపాలకృష్ణాచార్య తదితరులు పాల్గొన్నారు.



రథోత్సవంలో పాల్గొన్న స్థానిక ప్రముఖులు

శంకరమఠంలో రుద్రపారాయణం



రుద్రపారాయణలో పాల్గొన్న రుత్వికులు

చింతామణి, మే 19: పట్టణంలోని బ్రాహ్మణుల వీధిపేటలోగల శారదా శంకరమఠంలో శంకరజయంతి వారోత్సవంలో భాగంగా ఆదివారం ఉదయం 7.30 నుంచి అత్యధిక శతరుద్రపారాయణ చేశారు. శ్రీకాంతానంద సరస్వతి స్వామి సూచనతో భక్తులు పాటించారు. తాలూకా బ్రాహ్మణ మహాసభ, శంకర మఠం సేవా సమితి సంయుక్తంగా వేదబ్రహ్మ బీఆర్ శ్రీనాథ్ నేతృత్వంలో శారదాదేవి, శంకరాచార్యులు, తాండవేశ్వర మూర్తులకు మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం జరిపారు. అనంతరం బెంగళూరు కోటిరుద్రపారాయణ సమితి, చింతామణి రుత్వికులు చేరి సుమారు 155మందిచే 11సార్లు రుద్రపారాయణ చేశారు. అనంతరం అష్టావధానసేవ, మహామంగళారతి, తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తాలూకా తాలూకా బ్రాహ్మణసంఘం అధ్యక్షుడు ఎన్ కృష్ణ, కోశాధికారి మల్లికార్జున్, శంకరమఠం ప్రముఖులు గిరీశ్, వీణా ప్రియాంక, ప్రధాన అర్చకులు సీకే శ్రీనివాస్, బెంగళూరు కోటిరుద్రపారాయణ సమితి శేషగిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కార్ల రేసింగ్

బెంగళూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): మొబిల్ 1టిఎం రేసింగ్ ప్రమోషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ భాగస్వామ్యంతో ఇండియన్ రేసింగ్ లీగ్ పేరిట కార్ల రేసింగ్ ఆకట్టుకుంది. బెంగళూరు రోడ్లు రేసింగ్‌తో హోరెత్తాయి. రాబోయే రేసింగ్ చాంపియన్‌షిప్ కోసం ఆదివారం ఐఆర్ఎల్ 2023 చాంపియన్ సోహిల్‌షా ఫార్ములా 4 లో రేసింగ్ చేశారు. కేటీపీఓ కన్వెన్షన్ సెంటర్ పరిసరాలలో రేసింగ్ జరిగింది. స్థానిక ప్రేక్షకులను ప్రొఫెషనల్ మోటార్ రేస్ ఆనందం కలిగించింది. మొబిల్ 1టిఎం 50 సంవత్సరాలు పూర్తి చేసుకుందని రేసింగ్ ప్రమోషన్స్ సంస్థ చైర్మన్ అఖిలేష్ రెడ్డి తెలిపారు. జూన్‌లో ముంబై, చెన్నైలలోనూ ఇటువంటి ప్రదర్శనలు కొనసాగుతాయన్నారు.



కేటీపీఓ ప్రాంతంలో రేసింగ్ ఇలా..

నీటిని పొదుపుగా వాడుకోవాలి

మహదేవపుర, మే 19: నగరంలో నీటి ఎద్దడి నేపథ్యంలో నీటిని పొదుపుగా వాడుకోవడంతోపాటు వర్షపునీటి సేకరణ విధానాలు పాటించే అంశంపై జాగృతి కల్పించేలా వాకథాన్ నిర్వహించారు. శాంతకృష్ణమూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రామమూర్తినగర్‌లో శనివారం వాకథాన్‌ను ఎమ్మెల్యే బైరతి బసవ రాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నీటి సంరక్షణ మనందరి బాధ్యత అన్నారు. ప్రజలలో చైతన్యం కల్పించేలా వాకథాన్ చేపట్టడం అభినందనీయమన్నారు. అలాగే నీటిని పొదుపుగా వాడడంతోపాటు శుద్ధి చేసిన నీటిని ఉపయోగించే అంశంపై కూడా ప్రజలలో అవగాహన పెరగాలన్నారు. ఐదు కిలోమీటర్ల మేర వాకథాన్ సాగింది. ఫౌండేషన్ అధ్యక్షురాలు శాంత కృష్ణమూర్తి మాట్లాడుతూ జీవజలం కోసం ఎస్‌కేఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటైన వాకథాన్‌లో ప్రజలు ఉత్సాహంగా పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. వర్షపునీటి సేకరణ, ఇంకుడుగుంతల ఆవశ్యకత గురించి



వాకథాన్‌లో పాల్గొన్న సంఘం సభ్యులు, ప్రజలు

వివరించారు. వాకథాన్‌లో జలనిపుణులు నవనీత్, డాక్టర్ వసంతి ఫౌండేషన్ సంస్థాపక సభ్యుడు కృష్ణమూర్తి బీబీఎంపీ ఇంజనీర్‌లు వినయ్, రమేశ్, సంజయ్, ప్రముఖులు ఆనంద్, పృథ్వి, సుబ్రహ్మణి, షైభేల్, హిరేగౌడ తదితరులు పాల్గొన్నారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీ - ఒకరి మృతి

చింతామణి, మే 19: చింతామణి - చేళూరు రోడ్డు మార్గంలో సిద్దేపల్లి క్రాస్ సమీపాన కనిశెట్టిహళ్లి క్రాస్ వద్ద రెండు ద్విచక్ర వాహనాలు అతివేగంగా ఎదురెదురుగా ఢీ కొనడంతో ఒక వ్యక్తి ఘటనాస్థలంలోనే మృతి చెందగా మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఆదివారం ఉదయం సుమారు 10.30 గంటలకు ప్రమాదం జరిగింది. తాలూకాలోని ఏనిగదలె సమీపానగల చింత మాకలహళ్లి నివాసి మనోజ్ (23) మృతి చెందిన వ్యక్తిగా గుర్తించారు. తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆలపల్లికి చెందిన 40ఏళ్ల వెంకటేశ్‌గా తెలుస్తోంది. వెంకటేశ్‌కు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స నిర్వహించి అనంతరం మెరుగైన చికిత్సకోసం చిక్కబళ్ళాపుర జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని కెంచార్లహళ్లి పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వాసవీ ఆలయంలో విశేష పూజలు

చేళూరు, మే 19: చేళూరులోని ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో కన్యకా పరమేశ్వరి దేవికి వాసవి జయంతిని పురస్కరించుకుని శనివారం విశేషపూజలు నిర్వహించారు. ఉదయం హోమాలు, పూజలు జరిగాయి. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని అలంకరించిన పల్లకీలోఆలం పుర వీధులలో ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విశేషపూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



పురవీధులలో అమ్మవారి ఊరేగింపు

బస్సులో పేలిన తుపాకీ !

▸▸ కల్పాక్కం అణువిద్యుత్ కేంద్రం సెక్యూరిటీ గార్డ్ మృతి

చెన్నై, మే 19 (ఆంధ్రజ్యోతి): కదులుతున్న బస్సులో ఏకే -47 తుపాకీ పేలి కల్పాక్కం అణు విద్యుత్ కేంద్రం సెక్యూరిటీ గార్డ్ మృతి చెందారు. ఆ తుపాకీ ప్రమాదవశాత్తూ పేలిందా? లేక ఆ సెక్యూరిటీ గార్డ్ తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడా? అనే కోణాలపై పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. అణువిద్యుత్ కేంద్రం వద్ద కేంద్ర పారిశ్రామిక దళం షిఫ్ట్ పద్ధతిలో ఏకే -47 తుపాకులతో కాపలా కాస్తుంటారు. ఈ దళంలో కర్ణాటక రాష్ట్రానికి చెందిన రవికిరణ్ (37) కూడా ఇతర సభ్యులతో కలిసి అణువిద్యుత్ కేంద్రం వద్ద విధుల్లో పాల్గొనేవాడు. శనివారం రాత్రి రవికిరణ్ డ్యూటీకి వెళ్లారు. ఈ నేపథ్యంలో ఆదివారం వేకువ జాము డ్యూటీ ముగించుకుని అణువిద్యుత్ కేంద్రం ఉద్యోగులు నివసించే ప్రాంతానికి సిబ్బంది, ఇతర సెక్యూరిటీ సభ్యులతో బస్సులో బయలుదేరాడు. ఆ సమయంలో అందరూ తమ తుపాకులు పెట్టుకుని ఉన్నారు. ఆ బస్సు చదురంగపట్టినం డచ్‌కోట సమీపంలో వెళ్తుండగా



రక్తపు మడుగులో పడి ఉన్న రవికిరణ్, రవికిరణ్ (ఫైల్‌ఫొటో)

స్పీడ్ బ్రేకర్ దాటినప్పుడు కుదుపులు కావటంతో రవికిరణ్ చేతిలోని తుపాకీ పేలింది. తూటాలు రవికిరణ్ మెడలో దూసుకెళ్ళి తల గుండా బయటకు వచ్చాయి. దీంతో అక్కడికక్కడే ఆయన ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటనను చూసి బస్సులో ప్రయాణిస్తున్న వారంతా దిగ్భ్రాంతికి గురయ్యారు. ఈ సమాచారం తెలుసుకున్న కల్పాక్కం, చదురంగపట్టినం పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని రవికిరణ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చెంగల్పట్టు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆ తర్వాత కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం ఉన్నతాధికారులు రవికిరణ్ వద్దనున్న ఏకే -47 తుపాకీని పరిశీలించగా, అందులో మరికొన్ని తూటాలున్నట్లు గుర్తించారు. సాధారణంగా భద్రతా దళం డ్యూటీలో ఉన్నప్పుడు మాత్రమే తుపాకిలో తూటాలు లోడ్ చేస్తారు. డ్యూటీ ముగిసిన తర్వాతతూటాలను తీసి తమ బెల్టు సంచుల్లో దాచిపెడతారు. రవికిరణ్ తుపాకీ నుంచి తూటాలు తీయకపోవడం పలు అనుమానాలకు తావిచ్చే విధంగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. రవికిరణ్ తుపాకీలో తూటాలున్న విషయం మరచిపోవటంతో బస్సు స్పీడ్ బ్రేకర్ దాటేటప్పుడు తుపాకీ పేలిందా? లేక రవికిరణ్ తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్యచేసుకున్నాడా? అనే కోణాలపై కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం ఉన్నతాధికారులు, చదురంగపట్టినం పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. తుపాకీ పేలుడులో ప్రాణాలు కోల్పోయిన రవికిరణ్ ఏడాది క్రితమే బదిలీపై కల్పాక్కం అణువిద్యుత్ కేంద్రానికి వచ్చారని, ఆయనకు అనుషా అనే భార్య, హస్విని, రిత్తిక అనే ఇద్దరు కుమార్తెలున్నారని అధికారులు తెలిపారు.

మహిళకు బెదిరింపు కేసులో

బెంగళూరు వాసి అరెస్ట్

బెంగళూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో నకిలీ ఉద్యోగాలు ప్రకటన జారీ చేసి మహిళను బెదిరించి మోసానికి పాల్పడిన మేరకు గోవా సైబర్‌క్రైమ్ పోలీసులు బెంగళూరుకు చెందిన వీ మోహన్‌రాజ్ (29)ను ఆదివారం అరెస్టు చేశారు. గోవాకు చెందిన మహిళ ఈ మేరకు అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. విదేశీ బ్యాంకులో ఉద్యోగాలు ఖాళీ ఉన్నాయని నకిలీ ప్రకటన జారీ చేసి చాటింగ్ యాప్ ద్వారా సంప్రదించారన్నారు. ఆరోపితుడు వీడియోకాల్ చేసి ఆన్‌లైన్ ఇంటర్వ్యూ జరిపారన్నారు. ఇతడితోపాటు పలువురు కనిపించారని వారంతా కంపెనీ ప్రతినిధులుగా పరిచయం చేశారన్నారు. ఆ తర్వాత వివస్త్ర కావాలని డిమాండ్ చేశారని వాటికి సంబంధించిన వీడియోలు, స్క్రీన్‌షాట్‌లు తీసుకున్నారన్నారు. ఆ తర్వాత బ్లాక్‌మెయిల్ ప్రారంభించారని రెండు నెలలుగా వేధిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. బెంగళూరుకు వచ్చి కలవాలని లేదంటే ఫోటోలు, వీడియోలు వైరల్ చేస్తామని బెదరించారన్నారు. గోవా ఐపీఎస్ అధికారి రాహుల్‌గుప్త నేతృత్వంలో బాధితురాలితోపాటు వచ్చి మోహన్‌రాజ్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. అతడు తప్పు చేసినట్టు అంగీకరించాడన్నారు. అతడినుంచి మొబైల్, ఇతరత్రా వస్తువులు స్వాధీనం చేసుకుని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపినట్టు తెలిపారు.

తల్లి మృతదేహం చెంతనే...

నాలుగు రోజులు

బెంగళూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): కన్నతల్లి మృతి చెందిందనే విషయాన్ని గుర్తించలేని ఓ మానసిక అస్వస్థురాలైన కుమార్తె నాలుగురోజులపాటు గడిపిన హృదయ విదారక సంఘటన ఉడుపి జిల్లా కుందాపుర తాలూకాలో చోటు చేసుకుంది. సమీపవాసులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు మానసిక అస్వస్థురాలైన కుమార్తెను ఆసుపత్రికి తీసుకెళ్లిన కాసేపటికే తుదిశ్వాస వీడారు. కుందాపుర తాలూకా దాసనహాడి గ్రామంలో జయంతిశెట్టి (62), కుమార్తె ప్రగతి శెట్టి (32)లు నివసిస్తున్నారు. ప్రగతిశెట్టి మానసిక అస్వస్థురాలు. తల్లి జయంతిశెట్టి వంటపనిచేసి జీవనం సాగించేవారు. నాలుగురోజులక్రితం అనారోగ్యానికి గురై మృతి చెందింది. విషయాన్ని గుర్తించలేని కుమార్తె తల్లి మృతదేహం చెంతనే ఆహారం, నీరు లేక అక్కడే ఉండిపోయింది. ఆదివారం ఇంటినుంచి దుర్వాసన వస్తుండడంతో స్థానికులు అనుమానంతో పరిశీలించారు. జయంతిశెట్టి మృతి చెందినట్టు గుర్తించారు. అయితే కుమార్తె ప్రగతిశెట్టి అస్వస్థతకు గురయ్యారని తెలుసుకున్నారు. వెంటనే కుందాపుర పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ప్రగతిశెట్టిని కుందాపుర తాలూకా ఆసుపత్రికి తరలించారు. జయంతిశెట్టిని పోస్టుమార్టం నిమిత్తం తీసుకెళ్లారు. ఆసుపత్రిలో చేరిన ప్రగతిశెట్టి కాసేపటికే తుదిశ్వాస వీడారు. రెండు మృతదేహాలకు పోస్టుమార్టం జరిపి కుందాపుర పోలీసులే హెంగవళ్లిలో అంత్యసంస్కారాలు నిర్వహించారు. సమీప బంధువులు ఎవరూ లేకపోవడంతో పోలీసులు సేవలు చేశారు.

వీడిన బాలుడి మృతి మిస్టరీ

▸▸ ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిస కావడంతో హతమార్చిన అన్న

దొమ్మసంద్ర, మే 19: ఆనేకల్ తాలూకా సర్జాపుర పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రాణేశ్ మృతి చెందిన ఘటనలో రెండు రోజుల్లో నిందితుడిని అరెస్టు చేశారు. వరుసకు అన్న అయ్యే శివకుమార్ (18) హత మార్చినట్టు గుర్తించారు. స్వగ్రామం నుంచి వచ్చిన ప్రాణేశ్ మొబైల్‌లో జూదం ఆడేవాడు. దీంతో చాలామొత్తాన్ని పోగొట్టుకున్నాడు. దీన్ని గుర్తించిన శివకుమార్ పలుమార్లు ప్రాణేశ్‌కు బుద్ధి చెప్పాడు. ఇటీవల ఆన్‌లైన్‌గేమ్స్‌కోసం శివకుమార్, ప్రాణేశ్‌ల మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో శివకుమార్‌ను ప్రాణేశ్ నాన్న మందలించాడు. దీందో కోపంతో ఉన్న శివకుమార్ బుధవారం చివరకు ప్రాణేశ్‌తో గొడవపడి హతమారుస్తాడు. అయితే ఏమీ సంబంధం లేనట్టుగా శివకుమార్ ఉంటాడు. పోలీసులు దర్యాప్తులో శివకుమార్ చేసిన ఘటనను అంగీకరిస్తాడు. శనివారం నిందితుడిచే పంచనామా చేయించారు. సీఐ నవీన్‌కుమార్ నేతృత్వంలో రెండు రోజుల్లోనే కేసును చేధించడం హర్షం వ్యక్తం అవుతోంది.



పంచనామా చేయిస్తున్న పోలీసులు

అంజలి చెల్లెలి ఆత్మహత్యాయత్నం

బెంగళూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): హుబ్బళ్ళిలో అంజలిని హత్య చేసిన నిందితుడు గిరీశ్‌కు చికిత్సలు అందిస్తుండడాన్ని జీర్ణించుకోలేని అంజలి చెల్లెలు యశోద ఆత్మహత్యకు ప్రయత్నించారు. హుబ్బళ్ళిలో ప్రేమను నిరాకరించినందుకు అంజలిని వారింటికి వెళ్లి కత్తితో కిరాతకంగా పొడిచి గిరీశ్ హత్యకు పాల్పడ్డాడు. ఆ తర్వాత రాజకీయ నాయకులు, పోలీసులు, మంత్రులు, అధికారులు మా ఇంటికి వచ్చి అంజలికి న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారని కానీ పట్టుబడిన నిందితుడికి శిక్షించకుండా చికిత్సలు అందిస్తూ సేవలు చేస్తున్నారని యశోద రెండు రోజులుగా బాధపడుతుండేదని అవ్వ గంగమ్మ అంబిగెర తెలిపారు. యశోద శనివారం ఇంటోనే ఫినాయిల్ తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబీకులు వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందిస్తున్నారు.

ఘనంగా గిరిజా కల్యాణోత్సవం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

విజయపుర, మే 19: మంచి వర్షాలు కురవాలని కోరుతూ లోకకల్యాణార్థం పట్టణంలోని నీలకంఠేశరస్వామి ఆలయంలో కల్యాణోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణం 13వ వార్డులోని నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో గిరిజా కల్యాణం నిర్వహించారు. వేదబ్రహ్మ సోలూరు పునీత్‌కుమార్ శాస్త్రి నేతృత్వంలో ధార్మిక కార్యక్రమాలు సాగాయి. ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటైన కార్యక్రమాల్లో గిరిజా కల్యాణోత్సవం నిర్వహించారు. ఉత్సవంలో బెంగళూరు నాగరబావి ప్రాంతానికి చెందిన బాలకృష్ణప్ప, బాబు సురేశ్ కుమార్, ఎస్ గోవింద్‌రావ్, పునీత్‌కుమార్, ఆలయానికి చెందిన సుమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ప్రధాన అర్చకులు మురళిశర్మ నేతృత్వంలో ధార్మిక కార్యక్రమాలు సాగాయి.